క్లుప్తంగా

పీఎంపీఏ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి



సదస్సులో మాట్లాడుతున్న పీఎంపీఏ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు

మధురపూడి: రాజమహేంద్రవరంలోని రెడ్డి ఫంక్షన్ హాల్లో ఈ నెల 26వ తేదీన నిర్వహించే ది ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీఏ) వ్యవస్థాపక దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు విజ్ఞప్తి చేశారు. కోరుకొండ శ్రీరస్తు కల్యాణ మండపంలో గురువారం పీఎంపీఏ వైద్య, విజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. కోరుకొండ శాఖ అధ్యక్షుడు కుంచే వినోద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తోరాటి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ ఏర్పడి 61 ఏళ్లు పూర్తయ్యిందన్నారు. 62వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపుకోవడానికి సంసిద్ధం కావాలని కోరారు. రాజమహేంద్రవరంలోని ప్రైవేటు హాస్పిటల్స్ డాక్టర్లు ఉండవల్లి సత్తిబాబు, దుగ్గిరాల మాధవి, పీఎంపీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుమళ్ల రాంబాబు, జిల్లా అధ్యక్షుడు బళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాహనాలకు వేలం



మోటారు సైకిళ్ల వేలం నిర్వహిస్తున్న అధికారులు

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరంలోని ప్రొహిబిషన్ ఎక్సైజ స్టేషన్‌లోని ఆరు ద్విచక్ర వాహనాలకు గురువారం వేలం నిర్వహించారు. వీటిని రూ.49 వేలకు ఓ పాటదారుడు దక్కించుకున్నాడు. కార్యక్రమంలో కె.లావణ్య, సీఐ జె.శ్రీనివాస బాలాజీ, ఎస్సై బి.శ్రీనివాసు, సిబ్బంది పాల్గొన్నారు.

గైట్‌లో సమగ్ర విద్యపై వర్క్‌షాప్



జ్యోతి వెలిగించి వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న ప్రముఖులు

రాజానగరం: స్థానిక గైట్ డిగ్రీ కళాశాలలో సమగ్ర విద్యపై ఉపాధ్యాయులకు గురువారం వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా అరబిందో యాక్షన్ విద్యా సంస్కృతి కన్సల్టెంట్ సి.లక్ష్మీజ్యోతి మాట్లాడుతూ బాహ్యంగా సంపాదించేవి జీవిత లక్ష్యాలు కావని, అంతరంగంలో పొందినవే శాశ్వత ఆనందానిస్తాయన్నారు. వ్యక్తిగత లక్ష్యం, సామాజిక లక్ష్యం తదితర విషయాలపై బాగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వల్లీమాధవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్ఓడీ డాక్టర్ సావిత్రి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గృహ హింస నివారణపై అవగాహన ర్యాలీ



గృహ హింసకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న విద్యార్థులు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు గృహ హింస నివారణపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్) ప్రోగ్రామ్ ఆఫీసర్, మహిళా సాధికార విభాగం కన్వీనర్ డాక్టర్ ఎం.సుధామయి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎన్ఎస్ఎస్ దత్తత గ్రామమైన నాగరత్నం కాలనీలో ర్యాలీ నిర్వహించి, స్థానికులకు అవగాహన కల్పించారు. అంతకు ముందు కళాశాలలో నిర్వహించిన సదస్సులో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు మాట్లాడుతూ గృహ హింసను రూపుమాపే క్రమంలో ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈ నెల 23 వరకు పలు అంశాలపై సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. గృహ హింస చట్టాల ద్వారా మహిళలకు రక్షణ లభిస్తుందన్నారు. సీతానగరం మహిళా పోలీసు మహ్మద్ జవేరా బేగం మాట్లాడుతూ పిల్లలకు చిన్నతనం నుంచే మర్యాద నేర్పించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ, డాక్టర్ డి.నాగేశ్వరరావు, డాక్టర్ మాధవ్, సుబ్బారావు, ఫణీంద్ర కుమార్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం

మధురపూడి: రైతులు, భూ యజమానుల నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. కోరుకొండ మండలం రాఘవపురంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో మాట్లాడారు. రైతుల ఫిర్యాదుల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. కోరుకొండ తహసీల్దార్ సుస్వాగతం, ఆర్ఐ మిర్తివాడ రామిరెడ్డి పాల్గొన్నారు.

క్రిస్మస్ వెలుగులు

- అందంగా ముస్తాబైన చర్చిలు
- ఈ నెల 25 వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు
- ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



బిక్కవోలులో షాపు వద్ద అమ్మకానికి సిద్ధం చేసిన స్టార్లు



కాపవరంలో సెంటీనరీ ట్రినిటీ లూథరన్ చర్చికి విద్యుద్దీపాల అలంకరణ

బిక్కవోలు: క్రిస్మస్ సందర్భంగా నియోజకవర్గంలో సందడి మొదలైంది.ఏసుక్రీస్తు పుట్టిన రోజు వేడుకలను ఈ నెల 25న ఘనంగా నిర్వహించుకోవడానికి క్రైస్తవ సోదరులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏసు ప్రభువు జననం దీనులను, పాపులను రక్షించేందుకే అనేది విశ్వాసుల నమ్మకం. ఈ నేపథ్యంలో గ్రామాల్లోని ముఖ్య కూడళ్లలో క్రిస్మస్ స్టార్లు, ఏసు జననానికి గుర్తుగా పశువుల పాకలు ఏర్పాటు చేసి, వాటికి విద్యుద్దీపాలు అమర్చుతున్నారు. పలు చర్చిల్లో ఇప్పటికే క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. విద్యుద్దీపాల అలంకరణతో చర్చిలు వెలుగులు విరజిమ్ముతున్నాయి.

అనపర్తి నియోజకవర్గంలో..

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా పండగ వాతావరణం నెలకొంది. ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు క్రైస్తవులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ప్రేమ, క్షమాపణ, నిన్ను వలె నీ పొరుగువారిని ప్రేమించాలి, సన్మార్గంలో పయనించాలన్న క్రీస్తు ప్రబోధాలు సర్వమానవాళికి అనుసరణీయం. ప్రజల కోసం తన రక్తాన్ని చిందించిన క్రీస్తు జన్మదినం ప్రపంచ మానవాళికి ఒక పండగ రోజు. ఈ సందర్భంగా అన్ని గ్రామాల్లోని చర్చిలు, క్రైస్తవుల ఇళ్లను సుందరంగా ముస్తాబు చేశారు. డిసెంబర్ ప్రారంభం నుంచి జనవరి నెల ఒకటో తేది వరకు గ్రామాల్లోని వివిధ క్రైస్తవ సంఘాల పాస్టర్లు క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తుంటారు. ప్రపంచ వ్యాప్తంగా డిసెంబర్ 25న వేడుకలు జరుగుతాయి.

చర్చిల్లో సందడి

డిసెంబర్ వచ్చిందంటే క్రైస్తవ కుటుంబాల్లో పండుగ వాతావరణ ప్రారంభమవుతుంది. ఈ నెల ప్రారంభం నుంచే చాలామంది క్రిస్మస్ ఆరాధనలు ప్రారంభిస్తారు. చర్చిల్లో సండే స్కూల్ పేరుతో చిన్నారులు, యువతకు బైబిల్‌పై ప్రతి ఆదివారం ప్రత్యేక బోధన నిర్వహిస్తారు. క్రీస్తు బోధనలు పాటించి సన్మార్గంలో నడవాలని సూచిస్తారు. చిన్నారులు, యువత ఈ నెల రోజుల్లో తమ గ్రామాల్లో నిర్వహించే క్రిస్మస్ వేడుకల్లో క్రీస్తు జననం, క్రీస్తు జీవితం, ఆయన చేసిన అద్భుతాలు, బైబిల్‌లోని పలువురు ప్రవక్తల పాలనపై నాటికలు, నృత్యాలు ప్రదర్శిస్తారు. బైబిల్‌లోని అంశాలపై క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు, ప్రోత్సాహకాలు అందిస్తారు.

అందంగా ముస్తాబు

అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లోని క్రైస్తవ ప్రార్థనా మందిరాలను సుందరంగా ముస్తాబు చేశారు. రంగులు వేయించారు. చర్చిలపై ఏర్పాటు చేసిన విద్యుత్ దీప తోరణాలు, పెద్దపెద్ద స్టార్లు కనువిందు చేస్తున్నాయి.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



పాపులను రక్షించడానికే ఏసుక్రీస్తు జన్మించారు. అయితే మతం పేరుతో కొందరు లేనిపోని ఆర్భాటాలు చేస్తున్నారు. నమ్మకంతోనే ప్రభువును స్తుతించాలి. క్రైస్తవ్యం స్వీకరించిన వారు అందరికీ ఆదర్శంగా నిలవాలి. విశ్వాసుల నమ్మకాలను వమ్ము చేయకుండా బోధనలు ఉండాలి. నమ్మకం ఉన్న వారిని ప్రభువు ఎప్పుడూ రక్షిస్తూనే ఉంటారు.

– బిషప్ ఎంఎస్ సమర్పణ్, బ్లెస్సింగ్ ప్లేస్ చర్చి, తొస్సిపూడి

రెవెన్యూ సదస్సుకు 13 అర్జీలు



చినకొండేపూడిలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

సీతానగరం: చినకొండేపూడిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 13 అర్జీలు అందాయి. తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల కోసం ఏడు, అడంగల్‌లో తప్పులు సరిచేయాలని రెండు, పాత వాటి స్థానంలో కొత్త పాస్‌బుక్ ఇవ్వాలని ఒకటి, పంట పొలాలను సర్వే చేయాలని రెండు, కుల ధ్రువీకరణ పత్రం కోసం ఒక అర్జీ అందింది. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మూర్తి, ఆర్ఐ నవీన్, మండల సర్వేయర్ గౌతమ్, ఎంజోమెంట్ ఈవో పాటి సత్యనారాయణ, వీఆర్వో రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నన్నయలో క్రికెట్ పోటీలు



బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న వీసీ శ్రీనివాసరావు

రాజానగరం: ఢిల్లీ నుంచి గల్లీ వరకు క్రికెట్ విస్తరించిందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను గురువారం ఆయన బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటేందుకు విద్యార్థులు పోటీ పడాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ ఈ పోటీలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులతో యూనివర్సిటీ టీమ్‌ను ఎంపిక చేస్తామన్నారు. వచ్చే ఏడాది జనవరిలో చెన్నైలోని మద్రాస్ యూనివర్సిటీలో జరిగే దక్షిణ భారత పురుషుల క్రికెట్ పోటీలలో ఈ టీమ్ పాల్గొంటుందన్నారు.

విధులను అడ్డుకున్న వ్యక్తిపై కేసు

బిక్కవోలు: విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవి చంద్ర కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ రంగంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్ కొళ్ల లక్ష్మి, హెచ్‌సీ త్రిమూర్తులు కలిసి బుధవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రంగాపురం గ్రామంలోని కేతా అప్పల నర్సమ్మ ఇంటికి వెళ్లి తనిఖీ నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో తనుబోయిన అర్జున్ అనే వ్యక్తి ఇల్లు తనిఖీ చేయడానికి మీ రెవరంటూ వారిని విధులు నిర్వర్తించకుండా ఆటంకం కలిగించాడు. దీంతో కానిస్టేబుల్ లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్యా..



బిక్కవోలులో లక్ష కుడుముల అభిషేకంలో పాల్గొన్న టీపీ రెడ్డి దంపతులు



కుడుములు తయారు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి

- లక్ష్మీ గణపతికి లక్ష కుడుములతో అభిషేకం
- మొక్కు తీర్చుకున్న ఆకివీడు భక్తులు



కుడుముల తయారీలో నిమగ్నమైన వివిధ గ్రామాలకు చెందిన మహిళా సేవకులు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువైన శ్రీ లక్ష్మీ గణపతికి భక్తులు లక్ష కుడుములతో అభిషేకం చేశారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు గ్రామానికి చెందిన టీపీ రెడ్డి, గంగ దంపతులు గురువారం ఈ పవిత్ర క్రతువును చేపట్టారు. వీరు 28 ఏళ్లుగా స్వామివారిని కొలుస్తున్నారు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం తమ కోరిక తీరితే లక్ష కుడుములు సమర్పించుకుంటామని మొక్కుకున్నారు. వారి కోరిక నేరవేరడంతో స్వామికి మొక్కు తీర్చుకున్నారు. గురువారం లక్ష్మీ గణపతి ఆలయం వద్ద ఉదయం నుంచి స్వామివారికి పంచామృతా భిషేకాలు, హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష కుడుములు అభిషేకించారు. ఈ క్రతువులో అందరినీ భాగస్వాములు చేశారు. గ్రామస్తులే కాకుండా చుట్టు పక్కల గ్రామాలకు చెందిన సేవకుల బృందాలు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ కుడుముల తయారీకి సహకరించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే సత్తి మణి, ఆదిలక్ష్మి దంపతులు కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. స్వామి వారి దగ్గర ఉంచిన కుడుములను ఆటోల ద్వారా చుట్టు పక్కల గ్రామాలకు తరలించి భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆలయ కమిటీ అధ్యక్షుడు తమ్మిరెడ్డి నాగశ్రీనువాస్ రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులకు నేడు శిక్షణ

రంగంపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని ప్రజా ప్రతినిధులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ వి.వీర సాయిబాబు తెలిపారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఆదేశాల మేరకు మండల పరిషత్ అధ్యక్షులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లకు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ పథకంపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

గ్రామ స్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, స్థానిక సుపరిపాలన, ఆర్థిక అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై ఈ శిక్షణలో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. తనతో పాటు ఈఓపీఆర్డీ వెంకటరత్నం ఆధ్వర్యంలో జరిగే ఈ శిక్షణకు ప్రజా ప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

సీతానగరం: మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య ఆధ్వర్యంలో గురువారం ఆరోగ్య పరీక్షలు జరిపారు. ఇనుగంటి వారిపేటలో డాక్టర్ ఏసురాణి ఈ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి గురు, శనివారాల్లో అంగన్‌వాడీ, పాఠశాలల్లో ఉన్న పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తున్నామన్నారు. వయసుకు తగిన బరువు, ఎత్తు ఉన్నారా, హిమోగ్లోబిన్, రక్తపోటు స్థాయి, నేత్ర, నోటి పరీక్షలు చేస్తున్నట్టు తెలిపారు. ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉంటే గుర్తించి, తగిన వైద్యసేవలు అందించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు, స్కూల్ హెచ్ఎం కె.శ్రీదేవి, ఏఎన్ఎం శాంతి, ఎంఎల్‌హెచ్‌పీ ఎ.కృష్ణవేణి పాల్గొన్నారు.

కర్ర పెండలం సాగు పరిశీలన

రంగంపేట: కర్ర పెండలం సాగులో ఆశించే పిండినల్లి సమస్యపై రైతులు తగు జాగ్రత్తలు వహించాలని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ యం.సంపత్‌కుమార్ సూచించారు. మండల పరిధిలోని సింగంపల్లి గ్రామంలో గురువారం ఆయన కర్ర పెండలం తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫెనోకాక్కస్ మణిహోటి అనే పిండినల్లి రకం తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో కర్ర పెండలం సాగుపై ప్రభావం చూపుతుందన్నారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో ఈ సమస్య లేదన్నారు. ఆ రాష్ట్రాల్లో ఈ రకమైన పిండినల్లి సమస్య అధికంగా ఉండడం వలన రైతులు విత్తనానికి వాడే కర్రని తీసుకువచ్చేటప్పుడు జాగ్రత్తలు వహించాలని సూచించారు. పెద్దాపురం హెచ్ఆర్ఎస్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి.సునీత మాట్లాడుతూ కర్ర పెండలం సాగులో ఎర్రనల్లి సమస్య మన ప్రాంతంలో ఎక్కువగా ఉందన్నారు. ఈ ఎర్రనల్లి నివారణకు స్పిరోమేసిఫిన్ 0.6 ఎంఎల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యానాధికారి కె.దివ్యశ్రీ, హెచ్ఈఓ అరవింద్, వీహెచ్ఏ రామకృష్ణ, రైతులు వేగిశెట్టి వెంకటరత్నం, గుడాల దుర్గాప్రసాద్, యానాల సూరిబాబు పాల్గొన్నారు.

జాతీయ రహదారిని కమ్మేసిన యాసిడ్ పొగ



ట్యాంకర్ నుంచి యాసిడ్ లీకై వెలువడుతున్నపొగ

రాజానగరం: స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల సమీపంలో గురువారం ఉదయం జాతీయ రహదారిని యాసిడ్ (హెచ్‌సీఎల్) పొగలా కమ్మేసింది. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీవ్రత పెరగకుండా చర్యలు తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. విశాఖపట్నం నుంచి దేవరపల్లికి యాసిడ్ (హెచ్‌సీఎల్) లోడుతో వెళుతున్న ట్యాంకర్‌కు దిగువ భాగంలో రెండు చోట్ల రంధ్రాలు పడ్డాయి. వాటి నుంచి యాసిడ్ రహదారిపై కారుతూ పొగలా కమ్మేసింది. ఈ పొగ సోకిన కొందరు ప్రయాణికుల కళ్లలో మంట పుట్టి, దురదలు కూడా వచ్చాయి. సమాచారం అందుకున్న రాజమహేంద్రవరం, కోరుకొండ అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా ప్రాంతానికి చేరుకుని, లీకవుతున్న యాసిడ్ సాంద్రతను తగ్గించడానికి పైపులతో నీటిని చల్లారు. పక్కనే ఉన్న డ్రైనేజీలోకి ట్యాంకర్‌లోని యాసిడ్‌ను వదిలేశారు. ఈ యాసిడ్‌ను పీల్చడం వల్ల ఊపిరితిత్తులకు హాని కలుగుతుందని అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో ట్యాంకర్‌లో 35 టన్నుల హెచ్‌సీఎల్ లిక్విడ్ ఉంది.

సేవలను దివ్యాంగులు వినియోగించుకోవాలి



జి.మామిడాడ భవిత కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న కో ఆర్డినేటర్ నాగేశ్వరరావు

పెదపూడి: భవిత కేంద్రాల్లో దివ్యాంగులకు ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలు, సేవలను దివ్యాంగుల తల్లిదండ్రులు వినియోగించుకోవాలని ఐఈ కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు అన్నారు. జి.మామిడాడలో గల భవిత సెంటర్‌ను నాగేశ్వరరావు, ఎంఈఓ-2 సీవీవీ సత్యనారాయణ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులకు అందుతున్న సేవల తీరును వారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులు, విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. నూతన విద్యా బోధనోపకరణాలను ఉపయోగించి బోధన చేయాలన్నారు. అవసరమైన సూచనలు, సలహాలు ఐఈఆర్‌టీ పి.జ్యోతికి తెలియజేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పెదపూడి: ఉపాధి హామీ పథకంలో నిబంధనలు ఉల్లంఘించి పనులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. అనపర్తి మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం ఉపాధి పనులు చేపట్టాలని వారిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. అనంతరం డ్వామా పీడీ నాగేశ్వరరావు మాట్లాడుతూ అనపర్తి మండలంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి సుమారు రూ.8.38 కోట్ల మేర జరిగిన పనులకు సామాజిక తనిఖీ చేపట్టారన్నారు. వాటిలో సుమారు రూ.2.56 లక్షల మేర నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు గుర్తించినట్లు చెప్పారు. ఈ సొమ్మును రికవరీ చేయాలని ఆదేశించామన్నారు. ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేసినట్లు చెప్పారు. బినామీ మస్తర్లు వేయడం, చేసిన పనులకు సంబంధించి కొలతల్లో హెచ్చుతగ్గులు వంటి తప్పులు గుర్తించామన్నారు. ఎంపీడీవో రామకృష్ణారెడ్డి, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

బైక్ చోరీపై కేసు నమోదు

బిక్కవోలు: బైకు చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ బిక్కవోలు గ్రామానికి చెందిన గుబ్బల బాలాజీ ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. ఎప్పటిలాగే ఈ నెల17న తన ఇంటి ముందు రాత్రి 10 గంటల సమయంలో బైకును పార్క్‌చేసి ఇంటి లోపలికి వెళ్లాడు. ఉదయం చూసే సరికి బైకు అదృశ్యమవ్వడంతో చుట్టు పక్కల గ్రామాల్లో వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి

రాజానగరం: నేరాలను అదుపు చేయడంలో పోలీసులకు ప్రజల సహాయ, సహకారాలు ఎంతో అవసరమని సీఐ ఎస్పీ వీరయ్య గౌడ్ అన్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారిని ఆనుకుని వివిధ వ్యాపారాలు చేస్తున్న వర్తకులు ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు గురువారం రాత్రి సాయిబాబా గుడి సెంటరులోని వర్తకులకు అవగాహన కల్పించారు. నేరాలు జరిగినప్పుడు సంబంధిత నేరగాళ్లను వెంటనే పట్టుకునేందుకు ఇవి ఎంతగానో తోడ్పడతాయన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజానగరం: నందరాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్లపై మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నందున శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. ఆ సమయంలో నందరాడ, నరేంద్రపురం గ్రామాల్లోని అన్ని రకాల విద్యుత్ వినియోగదారులకు సరఫరా ఉండదు. ఈ విషయాన్ని ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ గురువారం ప్రకటనలో తెలిపారు.

మధురపూడి: కోరుకొండ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు గ్రామాలకు సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. ఆ సమయంలో జంబూపట్నం, శ్రీరంగపట్నం, కనుపూరు, కోటికేశవరం, గోకవరం మండలంలోని అచ్యుతాపురం, వెదురుపాక, గుమ్మలదొడ్డి, బావోజీపేట గ్రామాలకు విద్యుత్ ఉండదన్నారు.

కంప్యూటర్ కోర్సులో శిక్షణ

రాజానగరం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ప్రాంగణంలోని కామన్ ప్రొడక్షన్ సెంటర్ భవనంలో గల స్కిల్ హబ్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు శిక్షణ ప్రారంభమైంది. దీనిలో చేరేందుకు ఆసక్తి కలిగిన యువత తమ దరఖాస్తులను వెంటనే స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ టి.గణేష్‌కి అందజేయాలని జిల్లా మేనేజర్ ఎం.పెరుమాళ్లరావు తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకూ చదువుకున్న 18 ఏళ్ల నుంచి 40 ఏళ్ల మధ్య వయసున్న వారందరూ అర్హులేనన్నారు.

జీజీయూలో నేటి నుంచి వ్యవసాయ సదస్సు

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి వ్యవసాయ ఆవిష్కరణ సదస్సు జరుగనుందని వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్ తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు సంబంధించిన వివరాలను గురువారం ఆయన విలేకరులకు వివరించారు. దేశంలో 88 శాతం వరకు వ్యవసాయంపైనే ఆధారపడిన తరుణంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని చాలామంది సన్న, చిన్నకారు రైతులు అందిపుచ్చుకోలేకపోతున్నారు. సాంకేతికతను అమలు చేసి, వినూత్న పద్ధతులను పాటిస్తే వ్యవసాయంలో అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకునే జీజీయూలో వ్యవసాయ సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధకులు, ఇంకుబేటర్లు, వ్యవసాయ, ఉద్యాన, ఆక్వా కల్చర్ శాస్త్రవేత్తలు, ఎన్జీవోలు, నాబార్డు అధికారులు, వ్యవసాయ పరిశ్రమదారులు, రైతులు పాల్గొంటారన్నారు.

పత్రికా విలేకరి దందాలు

మధురపూడి: సీతానగరం మండలంలో ఓ ప్రముఖ పత్రికా విలేకరి దందాలకు పాల్పడుతున్నాడని టీడీపీ మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ తనయుడు అభిరామ్ ఆరోపించారు. కోరుకొండ పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆ విలేకరిపై అనేక మంది బాధితులు ఫిర్యాదులు అందాయన్నారు. అతడి దందాలపై పైస్థాయి వారికి ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

విద్యుత్ పొదుపుపై బుర్రకథ



విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

సీతానగరం: విద్యుత్‌ను ఎలా పొదుపు చేయాలో బుర్రకథ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. సీతానగరంలోని నాలుగు బొమ్మల సెంటర్ వద్ద రావులపాలేనికి చెందిన చిరంజీవి బృందం గురువారం ఈ కార్యక్రమం నిర్వహించింది. విద్యుత్‌ను అవసరమైన మేరకు మాత్రమే వాడుకోవాలని, వృథా చేయవద్దని ప్రజలకు అవగాహన కల్పించారు.

మోటారు బైక్‌ల మాయం

సీతానగరం: ఉండేశ్వరపురానికి చెందిన కుప్పాల ఏసుబాబు, చింతా సత్యనారాయణ మోటారు సైకిళ్ల దొంగతనానికి గురయ్యాయి. వారి ఫిర్యాదు మేరకు ఎస్సై డి.రామ్ కుమార్ గురువారం కేసులు నమోదు చేశారు. ఏసుబాబు మోటారు సైకిల్ ఏడు నెలల క్రితం, సత్యనారాయణ మోటారు సైకిల్ రెండు రోజుల క్రితం పోయాయి.

ధాన్యం డబ్బులు అడిగితే బెదిరింపులు

సీతానగరం: తమకు రావాల్సిన ధాన్యం డబ్బులను అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నాడని దుద్దిపూడి సూరిబాబుపై బొబ్బిల్లంకకు చెందిన పెండ్యాల అవిస్వామి, దాసరి వీరాస్వామి ఫిర్యాదు చేశారు. కొవ్వూరు మండలం పసివేదలకు చెందిన ధాన్యం కొనుగోలు ఏజెంట్ సూరిబాబుకు వీరిద్దరూ ధాన్యం విక్రయించారు. ఈ నేపథ్యంలో అవిస్వామికి రూ.23 లక్షలు, వీరాస్వామికి రూ.21 లక్షలు రావాల్సి ఉంది. ఆ డబ్బులను అడుగుతుంటే సూరిబాబు బెదిరిస్తున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై డి.రామ్ కుమార్ కేసులు నమోదు చేశారు.